నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం | ఏప్రిల్ 18, 2024 | www.navatelangana.com

సురేశ్‌షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రచార రతాన్ని జడ్పిటిసి తీగల తిరుమల గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మాజీ మంత్రి మహ్మద్ షబ్బీర్ అలీ గారి ఆదేశాల మేరకు ప్రారంభించామని, కాంగ్రెస్ పార్టీ జహిరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సామాన్యులతో పేద ప్రజల సంక్షేమం కోరుతూ ముందుండే నాయకుడు సురేష్ శెట్కార్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మధు,ఎంపీటీసీ నిమ్మశంకర్, జిల్లా సెక్రెటరీ తాటిపల్లి శ్రీకాంత్, పార్టీ సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి,రాములు,బుర్రి లింగం,శ్రీనివాస్, బాలరాజు, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.


ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న పార్టీ నాయకులు

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-గాంధారి

అగ్ని మాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా గాంధారి మండల కేంద్రంలోని వివిధ ఆస్పత్రిలో భాగంగా ఈ రోజు వివిధ హాస్పిటల్ నందు సిబ్బందికి, ప్రజలకు అగ్ని ప్రమాదాలను నివారించేందుకు అవగాహన కార్యక్రమాలు బుధవారం చేపట్టారు. అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ప్రశాంత్ గౌడ్, రాజు, శివ, నరేందర్ నవీన్ పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు



నామినేషన్‌కు వేళాయే

- నేడు లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల
- 25వ వరకు నామినేషన్‌ల స్వీకరణ
- మే 13న పోలింగ్, జూన్ 4న ఫలితాలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

లోకసభ ఎన్నికల్లో తొలి ఘట్టం నామినేషన్‌ల స్వీకరణకు వేళయింది. నేడు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనుండా.. నామినేషన్‌లను సైతం స్వీకరించనున్నారు. 25వ తేదీ వరకు నామినేషన్‌లను స్వీకరించనుండగా, 26న స్క్రూట్నీ 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్‌ల ఉపసంహరణకు గడువు విధించారు. మే 13వ తేదీనా పోలింగ్, జూన్ 4వ తేదీనా ఫలితాలు విడుదల చేయనున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ లోకసభ స్థానాలు ఉండగా.. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ తమ అభ్యర్థులను ఇది వరకే ప్రకటించాయి.

నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ నియోజక వర్గాలున్నాయి. ప్రస్తుతం 17,01,573 మంది ఓటర్లు ఉన్నారు. కొత్త ఓటర్ల నమోదు కోసం దాఖలైన దరఖాస్తులను ఈ నెల 25 వరకు పరిశీలించి జాబితాలో అర్హులైన వారి పేర్లను చేర్చనున్నారు. దీంతో పోలింగ్ నాటికి ఓటర్ల సంఖ్య మరికొంత పెరిగే అవకాశం ఉంది. పార్లమెంటు సెగ్మెంట్‌లో 936 ప్రాంతాలలో మొత్తం 1807 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. 85 ఏళ్ళు పైబడిన వృద్ధులు 9874, దివ్యంగ ఓటర్లు 41181 కలుపుకుని మొత్తం 51055 మంది ఓటర్లు ఇంటి నుండి ఓటు వేసే వెసులుబాటు అధికారులు కల్పించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన ఐదు రోజులలోపు, అంటే ఏప్రిల్ 22 వ తేదీ లోపు 12-డి ఫారం భర్తీ చేసి బీ.ఎల్.ఒలకు ఇవ్వాల్సి ఉంటుందని కలెక్టర్ సూచించారు. ఈ మేరకు ముందస్తుగానే వారికి బీఎల్‌ఓ ల ద్వారా 12 - డీ ఫారంలు అందజేశారు. ఎన్నికల విధుల్లో 7769 మంది సిబ్బంది పాల్గొననున్నారు.

25వ తేదీ వరకు కలెక్టరేట్‌లో నామినేషన్‌ల స్వీకరణ

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నామినేషన్లు స్వీకరించను న్నారు. సెలవు దినాలు మినహాయించి, మిగతా పని దినాలలో ఈ నెల 18 నుండి 25 వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 3:00 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులు నామినేషన్ ఫారం -2ఏ ను రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుండి ఉచితంగా పొందవచ్చు. నిర్ణీత గడువు లోపు రిటర్నింగ్ అధికారి ఛాంబర్ వద్దకు చేరుకున్న వారి నామినేషన్ ఫారాలు మాత్రమే స్వీకరించను న్నారు. ఒక అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చు. అభ్యర్థి వెంట మరో నలుగురిని మాత్రమే లోనికి అనుమతించనున్నారు. నామినేషన్ దాఖలు చేసే జనరల్ అభ్యర్థులు రూ. 25 వేలు, ఎస్సీ,ఎస్టీ కేటగిరీలకు చెందిన వారైతే రూ. 12500 లను సెక్యూరిటీ డిపాజిట్ రూపంలో జమ చేయాల్సి ఉంటుంది ఈ మొత్తాన్ని నగదు రూపేణా, లేదా చలానా రూపంలో చెల్లించే అవకాశం ఉంది. అయితే చెక్కులకు అనుమతి లేదు. జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులకు వారు పోటీ చేసే నియోజకవర్గంలోని ఎవరైనా ఒక ఓటరు నామినేషన్ ను ప్రతిపాదించాలని, రిజిస్టర్డ్ రాజకీయ పార్టీల తరపున పోటీ చేసే వారికి, స్వతంత్ర అభ్యర్థులకు 10 మంది ఓటర్లు అభ్యర్థి నామినేషన్‌ను ప్రతిపాదించాల్సి ఉంటుంది. నామి నేషన్ సమర్పించే సమయంలో అభ్యర్థులకు సహాయ పడేందుకు ఆర్.ఓ కార్యాలయం వద్ద హెల్ప్ డెస్క్ సైతం ఏర్పాటు చేశారు.

అదనపు బలగాలతో బందోబస్తు

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో అదనపు పోలీసు బలగాలతో పాటు, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నారు. ఎన్నికల్లో ప్రలోభాలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు అధికారులు పార్లమెంట్ పరిధిలో మొత్తం 22 చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. అయితే ఇప్పటి వరకు తనిఖీలలో రూ. 33,04,837 నగదుతో పాటు రూ. 28,00,000 విలువ చేసే ఆభరణాలు ఇతర వస్తువులను సీజ్ చేశారు. జప్తు చేసిన సొమ్మును జిల్లాలో ఏర్పాటు చేసే గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తారని, తగిన ఆధారాలు సమర్పించినట్లయితే గ్రీవెన్స్ కమిటీ వాటిని పరిశీలించి నగదు విడుదల చేస్తోంది.

పకడ్బందీగా ఏర్పాట్లు : కలెక్టర్

లోక్‌సభ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం సీపీ కల్మేశ్వర్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎం.సీ.సీ, సర్వేలెన్స్ బృందాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను, వీడియో సర్వేలెన్సు బృందాలను, ఎంసీఎంసీ కమిటీ, ఇతర కమిటీలను ఏర్పాటు చేసి నోడల్ అధికారులను నియమించామని అన్నారు. పోలింగ్ సిబ్బంది నియామకం పూర్తయ్యిందని, వారికి ఇప్పటికే ఏప్రిల్ 1, 2 తేదీలలో మొదటి దశ శిక్షణ తరగతులను పూర్తి చేశామన్నారు. కాగా, నామినేషన్ల దాఖలు సందర్భంగా నిర్వహించే ర్యాలీలకు సువిధ ద్వారా ముందస్తుగానే దరఖాస్తులు చేసుకుని అనుమతి పొందాలని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సూచించారు. ఎన్నికల నియమావళిని అనుసరిస్తూ, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంతో పాటు పరిసర ప్రాంతాలలో 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని, నలుగురి కంటే ఎక్కువ సంఖ్యలో ఒకే చోట గుమిగూడి ఉండకూడదని తెలిపారు. నామినేషన్లు వేయడానికి వచ్చే అభ్యర్థి వెంట మరో నలుగురిని మాత్రమే లోనికి అనుమతించడం జరుగుతుందని, మిగతా అందరిని కలెక్టరేట్ మెయిన్ గేట్ నుండి 200 మీటర్ల దూరం వరకే అనుమతి ఉందని స్పష్టం చేశారు. ఎన్నికలను పురస్కరించుకుని ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా సుమారు 1900 మంది పాత నేరస్థులను బైండోవర్ చేశామని, భద్రతా కారణాలతో బ్యాంకులను మినహాయించి, మిగిలిన వారందరి వద్ద లైసెన్సులు కలిగి ఉన్న ఆయుధాలను డిపాజిట్ చేయించామని వివరించారు. నామినేషన్ల దాఖలు సందర్భంగా ప్రతి ఒక్కరు ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని కోరారు. పాత్రికేయుల సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

లోక్‌సభ ఎన్నికల తేదీలు

నామినేషన్‌ల స్వీకరణ	ఏప్రిల్	18-25
పరిశీలన		26
ఉపసంహరణ		29
పోలింగ్	మే	13
ఫలితాలు	జూన్	04

బాలసదన్ నుంచి

ఇద్దరు బాలికలు అదృశ్యం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని బాలసదన్‌లో ఉంటూ చదువుకుంటున్న ఇద్దరు బాలికలు అదృశ్యమైన ఘటన బుధవా రం చోటుచేసుకుంది. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని బాలసాధనలో ఉంటూ చదువుకుంటున్న ఇద్దరు విద్యార్థినిలు అదృశ్యమైనట్లు పట్టణ సీఐ చంద్రశేఖం రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ వివరాల ప్రకారం హరిజనవాడ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు బాలికలు గంగోత్రి(11), నజియా(7) సంవత్సరాలు ఇద్దరు బాలికలకు తల్లిదండ్రులు లేకపోవడంతో ఆ ఇద్దరు జిల్లా కేంద్రంలోని బాలసదనంలో ఉంటూ హరిజనవాడలోని జడ్పీహెచ్ఎస్‌లో చదువుతున్నారనీ, ఈ నెల 13న ఉదయం 11:30 గంటలకు యధావిధిగా స్కూలుకు వెళ్లిన గంగోత్రి, నజీయాలు ఇద్దరు స్కూల్లో నుంచి ఉపాధ్యాయులకు చెప్పకుండా బయటకు వెళ్ళిపోయినారని, ఆ తర్వాత వారి గురించి ఎంత వెతికినా జాడ దొరకలేదని, బుధవారం బాలసదనం ఇంచార్జి గంగుబాయి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఇచ్చిన దరఖాస్తు మీద మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఇంతకుముందు కూడా గంగోత్రి అనే అమ్మాయి రెండుసార్లు ఇదేవిధంగా వెళ్లిపోగా ఆ అమ్మాయిని వెతికి తీసుకురావడం జరిగింది. వీరి ఆచూకీ తెలిసిన ఎవరైనా కూడా కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.


అదృశ్యం అయిన చిన్నారులు

గోప్యతలో ఆంతర్యమేంటి?

- బెల్ట్ షాపులపై దాడిని దాచిన ఎక్సైజ్ అధికారులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలో బెల్ట్ షాప్ పై మంగళవారం దాడి చేసిన ఎక్సైజ్ పోలీసులు.. మీడియా తెలియకుండా గోప్యంగా ఉంచడంలో ఆంతర్యం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రెడ్డిపేట్ గ్రామంలో బెల్ట్ షాప్ పై దాడి చేసి, తూతూ మంత్రంగానే కేసు నమోదు చేశారని, విధులకు అటంకం కలిగిస్తూరని ఒకరిపై స్థానిక పోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు చేసినట్లు తెలుస్తుంది. అయినా గుట్టు చప్పుడు కాకుండా మామూలుగా తీసుకొని, తూతూ మంత్రంగా కేసులు నమోదు చేయడంపై ప్రజలు ఆప్కార్ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా చట్టపరమైన చర్యలు తీసుకొని గ్రామాల్లో అక్రమంగా విక్రయిస్తున్న మధ్య విక్రయదారులను కఠినంగా శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇదే విషయమై ఎక్సైజ్ ఎస్సై విక్రమ్‌ను వివరణ కోరగా సిబ్బంది కొరత, పనుల భారం ఉండడంతోపాటు, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. వివరాలు స్థానిక పోలీసులు వెల్లడించాల్సి ఉందని పేర్కొడం గమనార్హం.

ఆలయ గోపురం నిర్మాణానికి విరాళం అందజేత

నవతెలంగాణ-సదాశివనగర్

రామారెడ్డి మండలం ఉప్పల్వాయి గ్రామంలోని శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయం ఆలయ గోపురం నిర్మాణానికి బీఆర్ఎస్ సదాశివ నగర్ మండల అధ్యక్షులు బొల్లిపల్లి మహేందర్‌రెడ్డి పదివేల రూపాయలు విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణానికి సహకరించినందుకు వారికి గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈసారైనా తీరుమారేనా..?

- ప్రయివేటు విద్యాసంస్థలపై అధికారుల ఉదాసీనత
- క్రీడా ప్రాంగణం లేకున్నా.. అపార్ట్‌మెంట్‌లలో నిర్వహిస్తున్న అనుమతులు
- కొత్త విద్యాసంవత్సరంలోనైనా విద్యాహక్కు చట్టం అమలుపై దృష్టి సారించేనా..?
- రాజకీయ నాయకుల పేరు చెప్పి తప్పించుకుంటారా
- జిల్లాలో 170 ప్రైవేట్ పాఠశాలలు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిబంధనలు పాటించని పలు ప్రయివేటు విద్యాసంస్థలకు కొత్త విద్యాసంవత్సరంలోనైనా ముకుతాడు వేస్తారా..? లేకుంటే యథారాజ తథా ప్రజా అన్న చందంగా వ్యవహరిస్తారా అని పట్టణ వాసులు ప్రశ్నిస్తున్నారు. క్రీడాప్రాంగణాలు లేకున్నా.. ఆఖరికి అపార్ట్‌మెంట్‌లలో స్కూళ్లు నిర్వహిస్తున్నా యథేచ్ఛగా అనుమతులు ఇవ్వడం పట్ల ఇప్పటికే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వచ్చే విద్యాసంసవత్సరంలోనైనా విద్యాహక్కు చట్టం ప్రకారం.. విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించేలా ప్రయివేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకుంటారా లేకుంటే ఉదాసీనత వ్యక్తపరుస్తారా అన్నది తేలాల్సి ఉంది.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 170 ప్రైవేట్ పాఠశాలలు

జిల్లాలో 78 ఉన్నత పాఠశాలలు, ఒకటవ తరగతి నుంచి 8వ తరగతి వరకు 82 పాఠశాలలు, ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు 10 ప్రయివేటు పాఠశాలలు కొనసాగుతున్నాయి. అధికారులు మాత్రం ఏ ఒక్క పాఠశాలను పూర్తిస్థాయిలో తనిఖీ చేయక పాఠశాలకు వెళ్లామా వచ్చామా అన్న రీతిలో తనిఖీలు చేయడంతో ప్రైవేట్ పాఠశాల యజమాన్యాలు ఇష్టానుసారుగా వ్యవహరిస్తున్నట్టు విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం మండల కేంద్రాల్లో, పట్టణాల్లో విద్యార్థుల నుంచి ఫీజులు ఎంత వసూలు చేయాలనేది నిర్ణయించినప్పటికీ వాటిని అమలు చేయడంలో విద్యాశాఖ అధికారులు విఫలమవుతున్నారు.



అపార్ట్‌మెంట్‌లో కొనసాగుతున్న ఓ ప్రయివేటు స్కూల్

ఫీజుల నియంత్రనా చట్టం అమలు శూన్యం

2008 సంవత్సరంలో జీవో నెంబర్ 91 జీవోను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ జీవో ఫీజుల నియంత్రణను తెలియజేస్తుంది. ఈ జీవో ఎక్కడ కూడా అమలు జరగడం లేదు. 2010 జూలై 30న జీవో నెంబర్ 42ను తీసుకొచ్చి, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఫీజులను ఎంత వసూలు చేయాలనేది ఈ జీవో సూచిస్తుంది. పాఠశాలల్లోని ఫీజులను గవర్నింగ్ బాడి నిర్ణయించాలి, గవర్నర్ బాడీ నిర్ధారించిన ఫీజుల కన్నా ఎక్కువ ఫీజులు తీసుకోవలసి వస్తే జిల్లా ఫీజుల నియంత్రణ అధికారి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అలాకాకుండా ఇష్టరాజ్యంగా ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకునే అధికారం ఈ కమిటీకి ఉంటుంది. గ్రామీణ ప్రాథమిక ఉన్నత పాఠశాలలకు రూ.7800, పట్టణాలలో రూ.9000, గ్రామీణ ప్రాంత హైస్కూల్‌కు రూ.10,800, పట్టణాల్లో రూ.12000 తీసుకోవాలనీ ఆ జీవోలో పేర్కొన్నారు. ఈ మూడు జీవోలు 1,42,91లు ఎక్కడ కూడా అమలు జరగడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి



కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలి. ఏ ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలోనైనా విద్యాకు చట్టాన్ని పాటించకుండా పాఠశాల నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకొని విద్యార్థిని, విద్యార్థులకు న్యాయం చేయాలి. నారాయణ చైతన్య పాఠశాలలపై దృష్టి పెట్టి ఎంత వరకు పర్మిషన్ ఉందో అంతవరకే పాఠశాలలను నిర్వహించుకునే విధంగా చూడాలి.

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముధం అరుణ్

అనుమతి లేని పాఠశాలలు అడ్మిషన్లు నిర్వహిస్తున్నాయి



జిల్లా కేంద్రంలో శ్రీ చైతన్య, నారాయణ కార్పొరేట్ పాఠశాలలు అనుమతులు లేకుండా తమ ఇష్టరీతిగా ఫీజులు పెంచి విద్యార్థులను రాచిరంపాన పెడుతున్నారు. అంతేకాకుండా అసలు ఎలాంటి అనుమతి లేకుండా నారాయణ పాఠశాల చాప కింద నీరులాగా అడ్మిషన్లు చేస్తూ టీచర్ల రిక్రూమెంట్ కూడా జరుపుతున్నది. ఇట్టి విషయం విద్యాశాఖ అధికారులకు తెలిసిన చోద్యం చూస్తున్నారు. ముఖ్యంగా ఫీజులు నియంత్రణ చట్టం డిఎఫ్ఆర్‌సిని అమలు చేయాలని విద్యార్థి సంఘాలుగా ఎన్నో సంవత్సరాల నుంచి పోరాటం చేస్తున్న ప్రభుత్వ విద్యాశాఖ అధికారులు ఈరోజు పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ సంవత్సరం కూడా ఇలానే కొనసాగితే ఆందోళనలు చేస్తామని హెచ్చరిస్తున్నాం.

పిడిఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి జి.సురేష్

అపార్ట్‌మెంట్‌లల్లో పాఠశాలలు అలాగే కొనసాగుతాయా..?

విద్యాహక్కు చట్టం ప్రకారం అపార్ట్‌మెంట్‌లల్లో పాఠశాలలు కొనసాగకూడదని నిబంధన ఉంది. కాని అధికారులు పట్టించు కోకపోవడంతో అపార్ట్‌మెంట్‌లలో పాఠశాలలను కొనసాగి స్తున్నారు. విద్యార్థులకు క్రీడా మైదానాలు లేక వారినీ ఆటలు ఆడించకపోవడంతో శరీరక ధృఢత్వాన్ని కోల్పోయి మానసిక ఉల్లాసానికి దూరమవుతున్నారు. ప్రైవేటు పాఠశాలలు తమ విద్యార్థులు మొదటి ర్యాంకు సాధించి తమ పాఠశాల పేరు రాష్ట్రస్థాయిలో రావాలని ఆరాటపడుతున్నారు. ప్రజలు కట్టే పన్నును వేతనాలుగా తీసుకుంటున్న ఉద్యోగులు సైతం ఈ ప్రైవేట్ పాఠశాల మేనేజ్మెంట్ ఏది చెప్తే అది సరే అంటూ వారికి పర్మిషన్ ఇస్తూ ప్రైవేట్ పాఠశాల యజమానియానికి సహకరం చడంతో వారు ఇష్టారీతిగా పాఠశాలలను నిర్వహిస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

విద్యార్థి సంఘాల వినతులను పట్టించుకోని అధికారులు

జిల్లాలో విద్యార్థి సంఘాలు ఎన్ని ధర్నాలు, రాస్తారోకోలు చేసిన అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పాఠశాలల్లో బ్యాగులు, పుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేసిన అధికారులు వెంటనే సంబంధిత ప్రైవేటు పాఠశాల యజమాన్యాలకు సమాచారం ఇచ్చి ఎలాంటి కేసులు చేయడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. లేదా ఎమ్మెల్యే నుంచి ఫోన్లు వస్తున్నాయని విద్యాశాఖ అధికారులు తప్పించుకుంటున్నారు.

గతంలో గంప.. ఈసారి ఎవరి పేరు చెప్తారో..?

గతంలో కామారెడ్డి నుంచి బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న గంప గోవర్ధన్ ఏ పాఠశాల పైన కేసులు చేస్తే బెదిరించేవారు అనే ప్రచారం జరిగింది. ప్రస్తుతం బిజెపి పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన కాటిపల్లి వెంకటరమణరెడ్డి ఉద్యోగస్తులు ఎలాంటి లంచాలు తీసుకోకుండా తమ విధులను నీతి నిజాయితీగా చేయాలని అధికారులకు సూచిస్తున్నారు. మున్సిపల్ నూతన చైర్మన్ ఎన్నికైన సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కామారెడ్డిలో నీతివంతమైన పాలన చేస్తామని అన్నారు. ఈ నీతినిజాయితీ అనేది వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలలపై ఏవిధంగా పనిచేస్తుందోనని కామారెడ్డి నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తున్నారు.

నవతెలంగాణ
నిజామాబాద్
గురువారం | ఏప్రిల్ 18, 2024 | www.navatelangana.com

వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

- హాజరైన రూరల్ ఎమ్మెల్యే భూపతి ఒడి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని తొర్లికొండ శిలాతీర్థ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే రేకులపల్లి భూపతి రెడ్డి దంపతులకు, జిల్లా కమిటీ సభ్యులకు, మండల కమిటీ సభ్యులకు తొర్లికొండ గ్రామ ప్రజలకు గ్రామ పెద్దలకు వెంకటేశ్వర స్వామి కృప కటాక్షాలు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు.



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే భూపతి రెడ్డి

మాజీ ఎంపీని పరామర్శించిన కోటపాటి

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లా మాజీ పార్లమెంటు సభ్యులు మధు గౌడ్ యాస్కి తల్లి అనసూయ ఇటీవల మృతిచెందారు. పట్టణానికి చెందిన ప్రవాస భారతీయుల హక్కులు సంక్షేమ వేదిక అధ్యక్షులు కోటపాటి నరసింహం నాయుడు బుధవారం వారి స్వగృహం హయత్ నగర్ హైదరాబాద్‌కు వెళ్లి చిత్రపటానికి నివాళులు అర్పించి మధు య స్కికి ప్రగాధ సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ శాసన మండలి సభ్యులు డి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు .



మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త జన్మదిన వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న మేయర్, నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మేయర్ దండు నీతుకిరణ్, నగర అధ్యక్షుడు సిర్పరాజు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. నగరంలోని మారుతి నగర్ స్నేహ సొసైటీ లో మానసిక వికలాంగుల మధ్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సీనియర్ నాయకులు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సుజిత్ సింగ్ ఠాకూర్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షులు సిర్ప రాజు, నాయకులు సుజీత్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ... నగర సుందరీకరణలో ఎనలేని కృషిచేసి నిజామాబాద్ హైదరాబాద్ తో పోటీపడేలా చేసిన ఘనత గణేష్ బిగాలకు దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో బి ఆర్ ఎస్ జిల్లా నాయకులు ఫయాజుద్దీన్,సుదాం రవిచందర్, పార్టీ అర్బన్ జనరల్ సెక్రటరీ ఎనగందుల మురళి, ధర్మపురి, గాండ్ల లింగం బిల్లా మహేష్,సత్యపాల్,చింతకాయల రాజుయెండల ప్రసాద్,కరిపే రాజు,శంకర్ మెతుకు శివకుమార్, అమర్, షేక్ హైమద్, ఇంతియాజ్,అబ్దుల్ భారి, అశోక్, రేసు హన్మండ్లు, శ్రీనివాస్ గౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ మాలధారణ స్వాముల శోభాయాత్ర

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

శ్రీరామనవమి పర్వ దినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో బుధవారం హనుమాన్ మాల ధారణ స్వాములు సీతారాముల ఉత్సవ విగ్రహాలతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. హాస కొత్తూర్ చౌరస్తా నుండి శ్రీగిరి క్షేత్రం వద్ద ఉన్న రామాలయం వరకు శోభయాత్ర అట్టహాసంగా సాగింది. డీజే చప్పుళ్లతో హనుమాన్ మాల ధారణ స్వాముల నృత్యాలతో శోభాయాత్ర ప్రజలను అలరించింది. శోభయాత్రకు పలువురు మహిళలు మంగళ హారతులతో ముందు నడిచారు. స్వాములతో పాటు యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



శోభాయంత్రలో పాల్గొన్న స్వాములు

ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను పర్యవేక్షించిన సీపీ



మాట్లాడుతున్న సీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనెవార్ నిజామాబాద్ నగరంలోగల ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను క్షుణ్ణంగా బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పూలాంగ్ చౌరస్తా, నిఖిల్ సాయి చౌరస్తా, కోర్టు చౌరస్తా, బైపాస్ రోడ్డు చౌరస్తా, క్రిష్ణ మందిర్ చౌరస్తా మొదలగు ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఏ వైపు నుండి భారీ వాహనాలు వస్తుంటాయి.. ఏ వైపు నుండి ఎక్కువగా వాహనాదారులు వస్తుంటారు.. ట్రాఫిక్ సిగ్నల్స్ సమయాన్ని ఏ మొత్తంలో టైమ్ ను ఏర్పాటు చేయాలి అని పరిశీలించారు. తదుపరి వాటి నియంత్రణ కోసం తీసుకోవల్సిన చర్యల గురించి సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసిపి నారాయణ, ట్రాఫిక్ సిఐ వి.వెంకటనారాయణ తదితరులు ఉన్నారు.

కోదండరాముని వార్షిక బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-ముప్కాల్

శ్రీ కోదండ రామాలయం 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా చేపట్టామని ఆలయ అర్చకులు జోషి నాగరాజు తెలిపారు. శ్రీ కోదండ రామాలయం యాభై వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ మహోత్సవాలను భక్తుల మధ్య పెద్ద ఎత్తున వైభవంగా నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తుల మధ్య శ్రీరాముని కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం రథోత్సవం చేపట్టారు. గురువారం భక్తుల సౌకర్యార్థం మహా అన్నదాన సత్రం చేపట్టడం జరుగుతుందని అన్నారు. చుట్టుపక్కల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

6వ తరగతిలో ప్రవేశాలకు ఆహ్వానం

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరంలో 6వ తరగతిలో అడ్మిషన్ల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ఎస్వో ఆర్.వినోద బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతిలో 40 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పాఠశాలలో దరఖాస్తులు చేసుకునే వారు ఆధార్ కార్డు, బోనాఫైడ్, బర్త్ సర్టిఫికెట్, కుల, ఆదాయ, ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలతో పాటు నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో సంప్రదించాలని సూచించారు.

కన్నుల పండుగగా సీతారాముల కల్యాణం

- ఘనంగా శ్రీ రామ నవమి
- అన్నదానంలో పాల్గొన్న భక్తులు

విలేకరుల బృందం

మాక్లూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో శ్రీ సీతా రాముల కళ్యాణం ఘనంగా బుదవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలో నూతనంగా ప్రారంభించిన శ్రీ లక్ష్మణ సహిత సీతారామాంజనేయ ఆలయంలో కన్నుల పండుగగా సీతారాముల కళ్యాణం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు. ఆలూరు మండలంలోని డీకంపల్లి గ్రామంలో శ్రీరామ నవమి వేడుకల్లో జిల్లా జెడ్పీ చైర్మన్ డీ. విఠల్ రావు పాల్గొన్నారు.

మెండోర: మండలంలోని ఎస్సారెస్పీ పోచంపాడ్ కోదండ రామాలయంలో శ్రీరామ నవమి సందర్భంగా సీతా రాముల కళ్యాణోత్సవంలో సతీసమేతంగా మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, నీరజా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. స్వామి వారి కళ్యాణానికి అధికారికంగా పట్టు వస్త్రాలు సమర్పించారు. సొంత ఖర్చులతో భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు వడ్డన చేశారు. కార్యక్రమంలో ఎంపిపి బురుకల సుకన్య కమలాకర్, మందిర సెక్రటరీ, అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని గ్రామ ప్రజలందరికీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి మండల కేంద్రంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

భీంగల్: భీంగల్ పట్టణ కేంద్రంలోని కప్పలవాగు వద్ద మోక్షానంద ఆశ్రమంలో శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే పిప్రి గ్రామ పరిసర అటవీ ప్రాంతంలోగల లొద్ది రామన్న ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొని మొక్కలు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు జనరల్ హాలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలో గల ఇందూరు తిరుమల క్షేత్రంలో అత్యంత వైభవంగ శ్రీరామ నవమి వేడుకలు జరిగాయి. సీతారాముల కళ్యాణోత్సవాన్ని కన్నుల పండుగగ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నర్సింహ రెడ్డి దంపతులు, దిల్ రాజు దంపతులు పాల్గొన్నారు. ఆలయ ఆస్థాన గాయకులు సమన్విత, భువనకృతి తమ గానామృతంతో స్వామివారి కీర్తనలను అద్భుతంగ పాడి రక్తి కట్టించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాములు, రవీందర్ యాదవ్, నరాల సుధాకర్, ప్రసాద్, రమేష్, నరేందర్, రాజేశ్వర్, మురళి, వేద పండితులు రోహిత్ కుమారాచార్యులు, సత్యం స్వామి, విజయ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

బోధన్: శ్రీరామనవమి సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం బోధన్ పట్టణంలోని శ్రీ రామాలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవంలో బోధన్ మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి - శరత్ రెడ్డి దంపతులు పాల్గొని కళ్యాణం జరిపించారు. ఈ సందర్భంగా బోధన్ చుట్టుపక్కల ప్రాంతాల నుండి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దుకాణాలు వెలువడడంతో శక్కర్ నగర్ ప్రాంతం రద్దీగా మారింది. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ నిర్వాహకులు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. అలాగే మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వీర హనుమాన్ శోభాయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు.

ఏర్గట్ల: మండలంలోని ఏర్గట్ల, తాళ్ళరాంపూర్, తడపాకల్ గ్రామాల్లో శ్రీ రామనవమి పండగను పురస్కరించుకుని సీతారాముల కళ్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా తడపాకల్ ప్రధానార్చకులు తిరునగరి కృష్ణ స్వామి మాట్లాడుతూ... స్వామి వారికి అభిషేకం అనంతరం కల్యాణం నిర్వహించామని, భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారని అన్నారు. భక్తుల కోసం ఆలయ, గ్రామ కమిటీల తరపున అన్నదానం నిర్వహించారు.

రెంజల్: మండలంలో బుధవారం సీతారాముల కళ్యాణం, జన్మదిన వేడుకలను భక్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. సీతారాముల విగ్రహాలను పల్లకిలో ఊరేగించి అనంతరం ఆలయంలో కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. మండలంలోని రెంజల్, బాగేపల్లి, నీలా క్యాంప్, వీరన్న గుట్ట, తాడు బిలోలి, సాటాపూర్, గ్రామాల్లో సీతారాముల కళ్యాణం, కందకుర్తి రామాలయంలో రాములవారి జన్మదిన వేడుకలను నిర్వహించడం విశేషం. అన్ని గ్రామాల్లో ఆయన జన్మదిన వేడుకలతోపాటు, ఊరేగింపు నిర్వహించి అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలను చేపట్టి గ్రామస్తులందరికీ అన్నదాన వితరణ చేశారు.



బోధన్‌లో..



నిజామాబాద్‌లోని ఖిల్లా రామాలయంలో..

భీంగల్ రూరల్: శ్రీరామ నవమి పర్వదినాన జాగిర్యాల్, పిప్రి గ్రామాల్లో శ్రీ సీతారాముల కళ్యాణంఉత్సవం ఘనంగా నిర్వహించారు. పిప్రీ గ్రామంలో చెందిన లొద్ది రామన్న రాముల వారి జాతరను నిర్వహించారు.

బాల్కొండ: మండల పరిధిలోని కిసాన్ నగర్ గ్రామంలో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామాలనుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మండల కేంద్రంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పోచమ్మగల్లిలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నవీపేట్: మండలంలోని స్టేషన్ ఏరియా సాయిబాబా ఆలయంలో బుధవారం ఘనంగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. శ్రీ రామ నవమి సందర్భంగా సాయిబాబా ఆలయంలో అభిషేకం, తొట్లే, ప్రత్యేక పూజలు నిర్వహించి సీతారాముల కళ్యాణాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మువ్వ నాగేశ్వర్ రావు, ఆలయ కమిటీ చైర్మన్ రాయల కృష్ణ, భాస్కర్, నవీన్, యాదగిరి, గంగాధర్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్: శ్రీ రామనవమి సందర్భంగా పట్టణంలోని సిద్దులగుట్టలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి సీతారాముల కళ్యాణానికి పట్టు వస్త్రాలు సమర్పించి కళ్యాణ ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య అయ్యప్ప శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిబాబా గౌడ్, నందిపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, డీసీసీ ఉపాధ్యక్షులు పెంట ఇంద్రుడు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బైండ్ల ప్రశాంత్, సీనియర్ నాయకులు పిప్పర సాయిరెడ్డి, మాజీ లిఫ్ట్ చైర్మన్ భోజరెడ్డి, నందిపేట్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పిరాజీ నాగరాజ్, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్ అగర్వాల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక ఎమ్మెల్యే పలు ఆలయాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే కార్యాలయం ముందు గల నాగలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్దుల గుట్టపై సీతారాముల కల్యాణ మహోత్సవానికి తలంబ్రాలు మోశారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేతో ప్రత్యేక పూజలు చేయించారు. మండలంలోని గోవింద్‌పేట్‌లో సీత రాముల కళ్యాణం లో పాల్గొన్నారు. మండలంలోని కోమన్‌పల్లి, పిప్రి, మంథని, దేగం, మాచర్ల గ్రామంలో సీతారాముల కళ్యాణంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లి కన్వీనర్ పాలెపు రాజు, కంచెట్టి గంగాధర్, కళిగోట్ గంగాధర్, రోహిత్ రెడ్డి, మందుల బాలు, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని తాళ్ల రామడుగు గ్రామం సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆలయ శాశ్వత చైర్మన్ భర్త పురుషోత్తం ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. మండలంలోని శ్రీ శేష సాయి లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో భక్తులు 61 వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, చివరి రోజున అన్న సత్రం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బచ్చు పురుషోత్తం, లాబిశెట్టి శ్రీనివాస్ గుప్తా, బండారి నరేష్, బాకారం రవి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



మోపాల్ : పాల్గొన్న దిల్‌రాజు



తలంబ్రాలు తీసుకెళ్తున్న వినయ్ రెడ్డి



మెండోరలో..

హామీలను మరిచిన బిజెపిని ఓడించాలి

- అదే మునీర్ అహ్మద్‌కు నిజమైన నివాళి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు

నవతెలంగాణ-కంఠేశ్వర్

హామీలను మరిచిన బిజెపిని ఓడించాలని, అదే మునీర్ అహ్మద్‌కు నిజమైన నివాళి అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు.

సిపిఎం పార్టీ నగర కమిటీ సభ్యులు మునీర్ అహ్మద్ సంతాప సభను నగరంలోని బహుజన కాలనీలో బుధవారం నిర్వహించారు. సంతాప ఈ సభకు హాజరైన సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజల పక్షాన పోరాడిన వ్యక్తి మునీర్ హైమద్ అని అన్నారు. ఇల్లు లేని నిరుపేదల కోసం బహుజన కాలనీలో ఇండ్ల స్థలాల పోరాటం నిర్వహించటంలో కీలక పాత్ర పోషించిన మునీర్ కరోనా కాలంలో కూడా కాలనీవాసులకు సరుకులను, ఆహార పదార్థాలను అందించారని అన్నారు. మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా చివరి వరకు పోరాడారని తెలిపారు. ప్రజలకు అనేక హామీలు ఇచ్చి వాటిని అమలుచేయడం విఫలమైన బిజెపిని ఈపార్లమెంట్ ఓడించాలని అన్నారు. అవినీతి సొమ్మును రాబట్టడంలో కానీ ఉద్యోగాలను ఇవ్వటంలో కానీ విఫలమయ్యారని ప్రజా సమస్యలపై పోరాడే వారిపైన మత విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ స్వలాభం పొందుతున్న బిజెపిని ఓడించటం ద్వారా మాత్రమే మునీర్ హైమద్ ఆశయం కోసం పని చేసిన వారమవుతామని ఆయన అన్నారు. ఈ సంతాప సభలో సిపిఎం నగర కార్యదర్శి సూరి, జిల్లా కమిటీ సభ్యురాలు సుజాత, నాయకులు విగ్నేష్, మహేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్‌బాబు

క్రికెట్ కిట్టు, క్రీడా దుస్తులు అందజేత



క్రీడా దుస్తులు అందజేసిన మిత్రులు

నవతెలంగాణ-మెండోర

శ్రీ రామనవమి పర్వదినం సందర్భంగా పోచంపాడ్ గ్రామానికి చెందిన క్రికెట్ జట్టుకు జగదీష్ జ్ఞాపకార్థం వారి మిత్రులు అరవింద్(విష్ణు), అర్జున్ పెద్దింటి, తిప్పని రవి కలిసి క్రికెట్ క్రీడా దుస్తులు వితరణ చేశారు. ఈ సంధర్భంగా క్రికెట్ జట్టు సభ్యులు అందరికి క్రికెట్ కిట్ క్రీడా దుస్తులు అందజేశారు. అనంతరం జగదీష్‌తో కలిసి కలివిడిగా తిరిగి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. స్నేహానికి ఉన్న విలువలను కాపాడుకోవలసిన బాధ్యత మన అందరిపై అన్నారు. కార్యక్రమంలో క్రికెట్ జట్టు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠకుల ప్రయోజనాలకు కృషి చేయాలి

నవతెలంగాణ-బోధన్

లైబ్రరీలో పుస్తక పఠనం కోసం వచ్చే పాఠకులకు కావలసిన సౌకర్యాలు కల్పించి వారికి సహకరించడానికి కృషి చేయాలని సాలురా అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం (లైబ్రరీ) శాశ్వత సభ్యులు అన్నారు. బుధవారం లైబ్రరీలో నిర్వహించిన సమావేశంలో సభ్యులు పలు అంశాలపై చర్చించి తీర్మానించారు. లైబ్రరీ నిర్వహణకు తప్పనిసరిగా గౌరవ వేతనంపై ఉద్యోగిని నియమించి సమయపాలన పాటించేలా చూడాలన్నారు. అలాగే లైబ్రరీ అభివృద్ధి కొరకు, భవిష్యత్ కార్యాచరణకు ప్రతినెల ఐదవ తేదీన సమావేశం నిర్వహించి ముందుకు సాగాలని సభ్యులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో లైబ్రరీ శాశ్వత సభ్యులు ఇల్తెపు శంకర్, బుద్దే రాజేశ్వర్, స్వామిగౌడ్, రాజాగౌడ్, శివకాంత్ పటేల్, కండెల సంజీవ్, బొర్ర గంగారం, అల్లె రమేష్, కందిమల్ హనుమండ్లు, కేజీ గంగారం, కర్దం అశోక్ బాబా, లింబూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

పదోన్నతి పొందిన సీఈఓకు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సొసైటీ సిఈఓగా పదోన్నతి పొందిన సాయి గారి లింబాద్రిని బుధవారం సన్మానించారు. విశాఖ కాలనీ వాసుల ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పలువురు పాల్గొని శుభాకాంక్షలు తెలిపినారు.. చిన్ననాటి మిత్రులు అమెరికాలో అసిస్టెంట్ ప్రొఫెసర్గా విధులు నిర్వహిస్తున్న పొద్దుటూరి ప్రశా ంత్ కు మార్ సైతం శు భాకాంక్షలు తెలిపారు..



సీఈవోను సన్మానిస్తున్న కాలనీవాసులు

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఆర్మూర్

అగ్ని ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అగ్ని మాపక కేంద్ర అధికారి మధుసూదన్ రెడ్డి సూచించారు. అగ్ని మాపక వారోత్సవాలలో భాగంగా బుధవారం పట్టణంలోని ఎంజె హాస్పిటల్ యందు అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సిబ్బంది సైతం అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.



మాట్లాడుతున్న ఫైర్ అధికారి

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
గురువారం | ఏప్రిల్ 18, 2024 | www.navatelangana.com

పోలీస్ స్టేషన్ ఆవరణలో చలి వేంద్రం


చలివేంద్రంను ప్రారంభిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-జుక్కల్

మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో జుక్కల్ ఎస్ఐ సత్యనారాయణ స్థానిక కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల నుండి పోలీస్ స్టేషన్‌కు పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు తాగునీరు ఏర్పాటు చేసామని, ఎండలు మండిపోతున్న దాహార్తి తీర్చేందుకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజి వాడి గ్రామ ఉపాధి కూలీలకు పనిప్రదేశంలో బుధవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశాల మేరకు పంపిణీ చేసినట్టు ఆశా వర్కర్ మామిండ్ల సవిత తెలిపారు. ఉష్ణోగ్రతలు గరిష్టస్థాయిలో పెరగడంతో ఉపాధి కూలీలు వడదెబ్బకు గురికాకుండా ముందస్తు చర్యలో భాగంగా పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మామిండ్ల అనిత ఉపాది కూలీలు పాల్గొన్నారు.


కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేత

వైభవంగా సీతారాముల కల్యాణం

- జిల్లా వ్యాప్తంగా కన్నులపండువగా రామనవమి వేడుకలు
- ఆలయాల్లో అన్నదానం

నవతెలంగాణ-విలేకరులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. రామాలయాలతో పాటు పలు ఆలయాల్లో సీతారాములోరి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో అన్నదాన వేడుకలు నిర్వహించారు.

సదాశివనగర్ : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సీతరాముల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. కుప్రియల్ రామాలయం నుండి గోపాల శర్మ ఇంటి వరకు భాజభజంత్రీల నడుమ ఉత్సవ విగ్రహాలు సీతరామ లక్ష్మణ ఆంజనేయన విగ్రహాలను తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

దోమకొండ : దోమకొండ మండల కేంద్రం లో ని శివ రామమందిరం ఆలయంలో ఆలయం కమిటీ అధ్యక్షులు అబ్రబోయిన రాజేందర్, అర్చకులు, నాయకుల ఆధ్వర్యంలో శ్రీరామ నవమి సందర్భంగా సీతా రాముల కళ్యాణము వేడుకలు వైభవం గా బుధవారం నిర్వహించారు. సీతారాముల విగ్రహాలకు ఓడి బియ్యం పోశారు. కార్యక్రమం లో ఎంపీపీ శారదా, జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్, మాజీ సర్పంచ్ అంజలి, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


దోమకొండ: శ్రీరాములోరి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు


మద్నూర్: ఎమ్మెల్యేను సన్మానించిన భజన మండలి సభ్యులు

కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

రామారెడ్డి : మండలంలో మద్దికుంట, పోసానిపేట్ శిశు మందిర్, రామారెడ్డిలలో శ్రీరామనవమి పురస్కరించుకొని బుధవారం సీతారామ కళ్యాణం కన్నుల విందుగా నిర్వహించారు. పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రామారెడ్డి సీతారామ కళ్యాణోత్సవంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు, మదన్ మోహన్ రావు, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, సందర్శకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడి జీవనశైలి ఆదర్శం : ఎమ్మెల్యే తోట

మద్నూర్ : శ్రీరాముడి జీవనశైలి యావత్ ప్రపంచానికి ఆదర్శమని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు కొనియాడారు. బుధవారం నాడు శ్రీరామనవమిని పురస్కరించుకొని మద్నూర్ మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన కీర్తన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరిపాలనలో గొప్ప రాజుగా, తండ్రి మాట జవదాటని కొడుకుగా, ఉత్తమ పురుషుడిగా, భర్తగా కష్ట సుఖాలను సమదష్టితో చూడగలిగే స్థిత ప్రజ్ఞత, కర్తవ్య పాలన, ధర్మనిరతి గల మహనీయుడిగా కోట్లాది మంది భక్తుల హదయాలలో నిలిచిపోయాడని అన్నారు. ప్రతి ఒక్కరూ శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకొని వారి జీవనమార్గాన్ని అనుసరించాలని సూచించారు.

పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంలోని రామాలయంలో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల వీధుల్లో పల్లకి సేవలో సీతారాములను ఊరేగింపు చేసిన అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కళ్యాణ మహోత్సవంలో వరుడు శ్రీరాముని తరపున కౌలాస్ సంజీవ్,వధువు సీతాదేవి తరపున ప్రణయ్ రెడ్డి వారి కుటుంబ సమేతంతో కళ్యాణాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కళ్యాణ మహోత్సవానికి జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీ కాంతారావు, గ్రామ పురోహితులు గ్రామ పెద్దలు యువకులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్రెడ్డి, మోహన్,పండరి, మల్లప్ప పటేల్,ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నవమి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే షిండే

మద్నూర్ : మద్నూర్ మండలంలోని మూడు రాష్ట్రాల సరిహద్దులోని సలాబత్పూర్ ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం నాడు నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంతు షిండే పాల్గొన్నారు. ఆయనతో పాటు సలాబత్పూర్ ఆంజనేయస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నర్సింలు గౌడ్ మద్నూర్ సింగిల్ విండో మాజీ చైర్మన్ విజయ్ బి ఆర్ ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వై గోవింద్ ఆ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి : శ్రీరామనవమి సందర్భంగా కామారెడ్డిలో జరిగిన సీతారాముల కళ్యాణం మహోత్సవ కార్యక్రమాల్లో కామరెడ్డి మున్సిపల్ చైర్మన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట్: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో సీతారాముల కళ్యాణం ఘనంగా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

జుక్కల్ : మండలంలోని లాడేగాం, జుక్కల్, కౌలాస్‌లో ఘనంగా శ్రీ రామనవమి వేడుకలు బుధవారం నిర్వహించారు. పురోహితులు శ్రీ చంద్రకాంత్ మహారాజ్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి భజనలు కీర్తనలతో భక్తులు ఊరేగింపు నిర్వహించారు. రాముని జన్మదినం సందర్భంగా డోళయమనం ఊయలలో ఉత్సవ మూర్తిని ఉంచి మహిళలు పాటలు పాడుతూ భజనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు అనిత సింగ్, ఉమకంత్ దేశాయ్, అక్షత్‌రాజా, తాజ మాజీ సర్పంచ్ హన్మాండ్లు, పకలవెంకటి, భజన సంఘం నాయకులు విఠల్, బోడ సాయిలు, కలై నారాయణ, వీరేష్ పటేల్, హన్మగౌడ్, తదితరులు పాల్గొన్నారు.


రామారెడ్డి: సీతారాముల కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే


కామారెడ్డి: పూజలు చేస్తున్న చైర్‌పర్సన్ ఇందుప్రియా


మద్నూర్: సీతారాముల కళ్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే


కామారెడ్డిలో...

ఘనంగా సీతారామ కళ్యాణ మహోత్సవం

- ఎడ్ల బడ్ల ఊరేగింపు



నవతెలంగాణ-లింగంపేట్

శ్రీరామనవమిని పురస్కరించుకొని లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో రామాలయాల వద్ద వేలాది మంది భక్తులు ఉదయం నుంచి చేరుకున్నారు. బుధవారం శ్రీరామ నవమి సందర్భంగా సీతారామ కళ్యాణం తిలకించడానికి వేలాది మది భక్తులు మహిళలు తరలివచ్చారు. సీతారామ కళ్యాణ మహోత్సవం లింగంపేట్ మండలంలోని బాణాపూర్ రామాలయం మెంగారం మోతే నల్లమడుగు భవానిపేట్ ముస్తాపూర్ సురాయపల్లి ఆయా గ్రామాల్లోతో పాటు లింగంపేట్ మండల కేంద్రంలోని రామాలయంలో సీతారామ కళ్యాణ మహోత్సవం వేద పండితుల మధ్య రంగ రంగా వైభవంగా జరిగింది సీతారామ కళ్యాణ మహోత్సవాన్ని తిలకించడానికి పెద్ద ఎత్తున మహిళలు భక్తులు చేరుకున్నారు. దీంతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. సీతారామ కళ్యాణ వివాహం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని లింగంపేట్ మండల కేంద్రంలోని రామాలయం వద్ద ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు అన్నదాన కార్యక్రమం పాల్గొన్నారు. బానాపూర్ గ్రామంలోని రామాలయంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం సాయంత్రం ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. కుల సంఘాల ఆధ్వర్యంలో ఎడ్ల బండ్లను అలంకరించి ఆలయం చుట్టూ ఐదు సార్లు ప్రదర్శన నిర్వహించారు. సీతారామ స్మరణతో ఆలయాలన్నీ మారుమోగాయి.

రామాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని రామాలయంలో బుధవారము శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు శేఖర్ పంతులు ఆయనకు ఆశీర్వదించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వ మానవాళికి గురువు, దైవభక్తి కలిగినప్పుడే సుఖ సంతోషాలతో వర్ధిల్లుతారని కొన్ని యాడారు. ఈ యోడు నియోజకవర్గ పాడిపంట , సుఖ సంతోషాలు , ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నట్టు తెలిపారు.


సీతారాముల కళ్యానోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావు

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కిష్టాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బాల్‌రాజ్, ఉప సర్పంచ్ ఏం సింగ్ వార్డు సభ్యులు సాయిలు , శేఖర్ , కార్యకర్తలు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంబిగే హన్మాండ్లు , సీనియర్ నాయకులు రామ్ రెడ్డి , బొడ్ల రాజు , మా రెడ్డి కృష్ణారెడ్డి , పద్మ సత్యనారాయణ సేట్ , తదితరులు పాల్గొన్నారు.

వందశాతం వసూలే లక్ష్యం

- ఆస్తి పన్ను చెల్లింపులపై 5 శాతం రాయితీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కొత్త ఆర్థిక సంవత్సరంలో 100 శాతం ఆస్తి పన్ను వసూలే లక్ష్యంగా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. మొన్నటి వరకు బకాయి పన్నులపై వేసిన పెనాల్టీలో 90 శాతం మేర డిస్కౌంట్ ప్రకటించి వసూలు చేయగా.. తాజాగా కొత్త ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను చెల్లింపులపై 5 శాతం రాయితీ ప్రకటించింది. ఏప్రిల్ నెల 30వ తేదీలోపు చెల్లించిన వారికి అవకాశం కల్పించారు. ఈ మేరకు నగరంలోని పలు ప్రధాన కూడళ్ల వద్ద మున్సిపల్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

అంతేకాకుండా నగరంలోని కాలనీలలో ప్రతినిత్యం చెత్త సేకరించి వాహనాల మైకుల ద్వారా కూడా ఆస్తి పన్ను చెల్లింపు చేసి ఐదు శాతం రాయితీని పొందండి అని ప్రకటన చేస్తున్నారు. ఈ సమాచారంతో నగర ప్రజలు ఎంతవరకు ఆస్తి పనులను చెల్లింపులు చేస్తారో వేచి చూడాల్సిందే.



ఆస్తిపన్ను చెల్లింపుల్లో 5 శాతం రాయితీ ప్రకటిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నగరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో మీ ఆస్తి పన్ను ఒక లక్ష రూపాయలు ఉన్నట్లయితే కేవలం 95,000 చెల్లించండి, మీ ఆస్తి పన్ను వెయ్యి రూపాయలు ఉన్నట్లయితే కేవలం 950 చెల్లించండి, మీ ఆస్తి పన్ను 500 రూపాయలు ఉన్నట్లయితే కేవలం 475 రూపాయలు చెల్లించండి అని ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆస్తి పన్నును emunicipal. telangana.gov.inలో 10 అంకెల PTIN ఎంటర్ చేసి చేల్లించండి, మీసేవ, సిటిజన్ బడ్డీ యాప్, నగరపాలక సంస్ధ కార్యాలయంలో , బిల్ కలెక్టర్ ల ద్వారా ఏ విధంగానైనా (బిల్లు) ఆస్తి పన్ను చెల్లించుకునే అవకాశాన్ని మున్సిపల్ శాఖ కల్పించారు.

మండల ఇన్‌చార్జిల ఏకగ్రీవ ఎన్నిక


ఎన్నికైన ఇన్‌చార్జిలను సన్మానిస్తున్న కార్యకర్తలు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని కామారెడ్డి నియోజకవర్గ ఏడు గ్రామాల కార్యకర్తల సమావేశంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ సూచన మేరకు, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి, జిల్లా మైనార్టీ నాయకులు సల్మాన్ ఆధ్వర్యంలో ఇన్చార్జీలను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇన్చార్జి అధ్యక్షునిగా మద్దికుంట నర్సాగౌడ్, ప్రధాన కార్యదర్శిగా కల్లూరి రగోతం రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గా రాతుల రెడ్డి నాయకులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తమపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలు అప్పగించినందున షబ్బీర్ అలీ కి, మోహన్ రెడ్డిలకు కతజ్ఞతలు తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో సురేష్ షట్కర్ గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు అందరిని కలుపుకొని పనిచేస్తామని అన్నారు. ఏడు గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురు ఆర్యవైశ్యుల చేరిక


కాంగ్రెస్‌లో పలువురు చేరిక

నవతెలంగాణ-కామారెడ్డి

ఆర్యవైశ్య కులస్తులకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ కాబట్టే తాము కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు శ్రీ సాయి దుర్గ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి పాత శివకష్ణమూర్తి తెలిపారు. అధ్యక్షులు మేడం కష్ణమూర్తి, కోశాధికారి చీల శ్రీధర్‌లు కులసంఘాల సభ్యులు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ, ఆర్యవైశ్యులకు రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా ఎంతో గుర్తింపునిచ్చిన కాంగ్రెస్ పార్టీకి కులస్తులంతా మద్దతు పలకాలని రాబోయే జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో సురేష్ షట్కర్ ని గెలిపించాలని ఆర్యవైశ్యులకు విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న షబ్బీర్ అలీ

నవతెలంగాణ-కామారెడ్డి

మండలంలోని గర్గుల్ గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ రవితేజ గౌడ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదా రు షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో బుధవారం చేరారు. తమ గ్రామం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌లో చేరడం అనివార్యమని, ఆయనతో పాటు సింగిల్ విండో వైస్ చైర్మన్ శంకర్‌గౌడ్, బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కర్ గెలుపు కోసం పనిచేయాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు.

బాధిత కుటుంబానికి ఎల్‌ఓసి అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి


బాధితులకు ఎల్‌ఓసి అందజేత

కంటి చూపు కోల్పోయిన తేలు ప్రశాంత్‌కు చికిత్స చేయించుకునే స్థోమత లేక జీవితం అంధకారంలో పడిపోతుందని మదనపడ్డ కుటుంబానికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ చొరువతో కంటి చూపు వచ్చింది. బిబిపేట్ మండల కేంద్రానికి చెందిన తేలు రాజలింగం కుమారుడు తేలు ప్రశాంత్ కు కంటి చూపు కోసం మెరుగైన చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 4.50 లక్షలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన చెక్కు, ఎల్‌వోసీని బుధవారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బిబీపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుతారి రమేష్ మాట్లాడుతూ కంటి చూపు కోల్పోయిన తేలు ప్రశాంత్ చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో అతని పరిస్థితిని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్‌కు వివరించగా ఆయన మానవత దక్పథంతో స్పందించి వారి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఆర్థిక సాయం అందించారని తెలిపారు. ఆర్థిక సాయం అందించిన షబ్బీర్ అలీకి, ముఖ్యమంత్రికి బాదిత కుటుంబ సభ్యులు కతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
గురువారం | ఏప్రిల్ 18, 2024 | www.navatelangana.com

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

బైపాస్ రోడ్డు సమీపంలో గిరిరాజ్ కాలేజీ వద్ద మంగళవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. గౌతమ్ నగర్ నివాసి అయిన మార్వాడే ధన్‌పాల్ మంగళవారం మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో తన స్నేహితులైన ఉమాకాంత్ అనుమటి వినోద్‌తో తన మోటార్ సైకిల్ పైన వెళ్తా ఉండగా బైపాస్ రోడ్ లో బైపాస్ రోడ్ లోని స్మశాన వైపు యూటర్న్ చేస్తుండగా అర్సపల్లి వైపు నుండి వస్తున్నటువంటి బొలెరో బండి డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడిపి దన్‌పాల్ బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో దన్‌పాల్ అక్కడికక్కడే మరణించినాడు. అతని స్నేహితులిద్దరికీ గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి తండ్రి నార్వాడే గౌతమ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు నిజామాబాద్ రూరల్ పిఎస్ ఎస్‌హెచ్‌వో మహేష్ తెలిపారు.

చెట్టు మధ్యలో చీలిక

పొంచి ఉన్న ప్రమాదం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



నగరంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఉన్న చెట్టు మధ్యలో నుండి విరిగిపోయే సూచనలు కనబడుతున్నాయి, గత పది రోజుల క్రితం బాగానే ఉన్న ప్రస్తుతం చెట్టు మధ్యలో నుండి చీలింది దీంతో విరిగిపోయో ప్రమాదం పొంచి ఉంది. అందుకు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నిర్వాహకులు ఆ కార్యాలయానికి సంబంధించిన అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలి. లేకుంటే చెట్టు విరిగి భవనం పైన, అక్కడ పార్కింగ్ చేసే వాహనాలపైన పడిపోకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌ను సందర్శించే ప్రజలు కోరుతున్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలి

- సిపిఐ(ఎంఎల్) చంద్ర పుల్లారెడ్డి పార్టీ జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్



మాట్లాడుతున్న మల్లేపల్లి ప్రభాకర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

భయంకర బూటకపు ఎన్కౌంటర్లను నిలిపివేసి నక్సల్స్‌తో ప్రభుత్వం చర్చలు జరుపాలని సిపిఐ(ఎంఎల్) చంద్ర పుల్లారెడ్డి పార్టీ జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ అన్నారు. బుధవారం నగరంలోని ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దండకారణ్యంలో 29 మంది నక్సల్స్‌ను ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం పొట్టన పెట్టుకుందని తెలిపారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం, కేంద్ర బీజేపీ సాయుధ బలగాలతో దండకారణ్యాన్ని ఎన్నికల పేరుతో అనువనువునా ఆడువులను జల్లాడా పడుతోందన్నారు. అడవుల్లోనే కేంద్ర సాయుధ బలగాలు తిష్ట వేసి, నక్సలైట్స్ ఏరివేతే లక్ష్యంగా పనిచేస్తూ ఈ రెండు నెలల కాలంలోనే 42 మంది అమాయక ఆదివాసీ ప్రజలను బీజేపీ ప్రభుత్వం పొట్టన పెట్టుకుందని అన్నారు. దండకారణ్యంలో ఉన్న అపారమైన ముడిసరుకు నిధి నిక్షేపాలు, రంగురాళ్లు, మైనింగ్ లను దోపిడీ చేసుకునేందుకే, అదానీ, అంబానీ, టాటా, బిర్లా, జిందాల్, పోస్కొ వేదాంత, విదేశీ కార్పొరేట్ కంపెనీలకు గుత్తా పెట్టుబడి దార్లకు అడవులను అప్పచెప్పడానికే ఈ భయంకర బూటకపు ఎన్కౌంటర్లకు బీజేపీ ప్రభుత్వం పాల్పడుతోందన్నారు. అక్కడి ప్రజల మధ్య యుద్ధాన్ని ప్రకటించి అడువుల్లోని ఆదివాసీలను కాంది శికులుగా పోలీసు క్యాంపులో బానిసలుగా చేసుకున్నారని అన్నారు. వెంటనే అడువులలో ఉన్న కేంద్ర, రాష్ట్ర, సాయుధ బలగాలను వెనక్కి పంపి వెయ్యాలని, అక్కడ శాంతిని నెలకొల్పాలని, బూటకపు ఎన్కౌటర్‌ను నిలిపి వేయాలని, మావోయిస్టు లతో ప్రభుత్వం చర్చలు జరుపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తీవ్రమైన ప్రజా ప్రతి ఘటన పాలక పార్టీలు వారి ఏజెంట్లు కార్పొరేట్ కంపెనీలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

విద్యార్థుల ఆత్మహత్యలను పట్టించుకోని సీఎం : ఎస్ఎఫ్ఐ



మాట్లాడుతున్న విఘ్నేష్

నవతెలంగాణ-బోధన్

బాసర ఐఐఐటీలో విద్యార్థులు సమస్యలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కనీసం పట్టించుకోవడం లేదని ఎన్నికలపై ఉన్న శ్రద్ధ, బాసర ఐఐఐటీ విద్యార్థుల ఆత్మహత్యలపై లేకుండా పోయిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విఘ్నేష్ అన్నారు. బుధవారం పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్రిపుల్ ఐటీ విద్యార్థుల ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజా పాలన మొదలై మూడు నెలల గడుస్తున్న విద్యాశాఖకు మంత్రిని నియమించక పోవడం దారణమని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించడంలో అక్షయపాత్ర విఫలం చెందుతుందని ఆరోపించారు. అలాగే బోధన్ ప్రాంతాన్ని విద్యా కేంద్రంగా అభివద్ధి చేసి ప్రభుత్వ విద్యాసంస్థలైన జవహర్ నవోదయ, ఇంజనీరింగ్ కాలేజీలను నెలకొల్పాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బోధన్‌లోని పలు కార్పొరేట్ విద్యాసంస్థలు డొనేషన్ల పేరిట అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, వాటిపై విద్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని లేనిచో భవిష్యత్తులో ఉద్యమాలు ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు మహేష్, బోధన్ డివిజన్ నాయకులు ప్రశాంత్, రాజేష్, విష్ణు, నాయకులు పాల్గొన్నారు.

ప్లీజ్... నా కొడుకుని హింసించకండి

మాజీ ఎమ్మెల్యే షకీల్ విన్నపం

నవతెలంగాణ-బోధన్



వీడియోలో మాట్లాడుతున్న షకీల్

హైదరాబాద్ జూబ్లీహిల్స్ కేసులో, అలాగే బారీకేడ్లను ఢీకొన్న కేసులో తన కొడుకు రాహిల్‌ని టార్గెట్ చేసి కొంతమంది పోలీసు అధికారులు హింసిస్తున్నారని, చిన్నపిల్లలను టార్గెట్ చేసి హింసించడం సరికాదని బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ బుధవారం దుబాయ్ నుండి వీడియో ద్వారా ప్రభుత్వానికి విన్నవించారు. కొంతమంది పోలీసు అధికారులు రాజకీయంగానో, ప్రత్యక్షంగానో తనతో శత్రుత్వం ఉంటే తనను టార్గెట్ చేయాలి కానీ తన 21 సంవత్సరాల కుమారుడిని అనవసరంగా టార్గెట్ చేసి బెదిరించడం, హింసించడం చేస్తూ మానసికంగా తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని తన ఆవేదన వ్యక్తం చేశారు. దయచేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కుమారుడిని వదిలేయాలని విన్నవించారు. తనకుమారుడు నిజంగా తప్పు చేస్తే చట్టపరంగా ఏ శిక్ష వేసిన దాని సిద్ధమని అన్నారు. కేసులో నిజనిర్ధారణ చేయడానికి సిబీఐతో గాని, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో గాని న్యాయ విచారణ జరిపించాలని అన్నారు. ప్రభుత్వాలు ఏవి శాశ్వతం కాదని, అవి మారుతూ ఉంటాయని కానీ తనపై కక్షతో తన కుమారుడిని కొంతమంది పోలీసు అధికారులు కక్షపూరితంగా ఎన్నో సెక్షన్లలో కేసులు పెట్టి నేరస్తుల మధ్య జైలులో ఉంచడం సరికాదని అన్నారు. చదువుకుంటున్న తన కుమారుడి జీవితం అంధకారం చేయవద్దని వీడియోలో వేడుకున్నారు. తన కుమారుడికి కాని, తన కుటుంబానికి కాని ఏమైనా జరిగితే తనను టార్గెట్ చేసిన ఆ పోలీస్ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన అన్నారు.

పల్లెల్లో రగులుతున్న వివాదాలు

నవతెలంగాణ- (వేల్పూర్)ఆర్మూర్

డివిజన్ పరిధిలో వీడీసీల ఆగడాలు హద్దు లేకుండా పోతున్నాయి. జిల్లాకు వచ్చిన సిపి కల్మేశ్వర్ వీడీసీలపై, పేకాట, వడ్డీ వ్యాపారులపై కొరడా ఝులిపిస్తున్నారు. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే మండలం అయిన వేల్పూర్‌లోని మోతే గ్రామంలో గత కొన్ని సంవత్సరాల నుండి ఎస్సీ కుటుంబాలకు, వీడీసీలకు మధ్య జరిగిన వివాదం చిలికి చిలికి గాలి వానల తయారైంది.

గ్రామంలోని ఎస్సి కటుంబాలకు చెందినటువంటి ఎకరంన్నర భూమిని విడిసి బలవంతంగా లాక్కోవాలని చూస్తుందని, తమ పైన సాంఘిక బహిష్కరణ చేయాలని నిర్ణయం తీసుకున్నారంటూ ఆరోపిస్తూ బాధిత కుటుంబీకులు మంగళవారం పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా విచారణకు ఆదేశించారు. గ్రామ శివారులోని సర్వే నబర్ 33 3లో ఎనిమిది ఎకరాల 34 గుంటల భూమి ఉండగా అందులో నాయకపోడు సంఘం వాళ్లకు నాలుగు ఎకరాల 17 గుంటలు, మరో నాలుగు ఎకరాల 17 గుంటలు తమ పేరున ఉందని అన్నారు. ,ఇందులోని మిగిలిన ఎకరంన్నర భూమిని పెన్సింగ్ చేసుకోగా ఆ భూమి వీడిసి వారిదని లాక్కోవాలని చూస్తున్నారని బాధిత వ్యక్తి ఇస్సపల్లి నడిపి గంగారం సిపికి ఫిర్యాదు చేశారు. కాగా తమ భూమి చుట్టూ నిర్మించిన ఫెన్సింగ్‌ను బలవంతంగా తొలగించి సాంఘిక బహిష్కరణ చేయాలని వీడిసి నిర్ణయించినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు ఇదే భూమి విషయంలో గతంలో వీడీసీ బలవంతంగా ఫెన్సింగ్ లాగేసి తమపై దాడికి దిగారని, సుమారుగా 20 మందికి పైగా కేసులు అయ్యాయని, ఇదే భూమికి సంబంధించి ఎస్సీ ఎస్టీ కేసు నడుస్తుందని బాధితులు సిపికి ఇచ్చిన ఫిర్యాదులో వివరించారు. తిరిగి మళ్లీ అదే తంతు వీడీసీ సభ్యులు కొనసాగిస్తున్నారని, దీంతో సిపి ఆర్మూర్ అసిస్టెంట్ కమిషనర్ బస్వారెడ్డితో మాట్లాడి వెంటనే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

20 వరకు 144 సెక్షన్ అమలు...

మంగళవారం సాయంత్రం 8 గంటల నుంచి ఈనెల 20 ఉదయం 6 గంటల వరకు జిల్లా సిపి ఆదేశాల మేరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్సై వినయ్ కుమార్ బుధవారం తెలిపారు. గ్రామంలో 5 గురు, అంత కంటే ఎక్కువ ఎక్కడ కూడా గుమిగూడి ఉండొద్దన్నారు. అలా ఎవరైనా గుమిగూడితే వారిపై చట్ట రిత్యా కేసులు నమోదు చేయబడతాయి అని హెచ్చరించారు.

- మోతే గ్రామంలో ఈనెల 20 వరకు 144 సెక్షన్



మోతే గ్రామ ముఖచిత్రం

కమనీయం..రామునోరి కళ్యాణం

- వైభవంగా శ్రీరామనవమి వేడుకలు
- భక్తులతో సందడిగా మారిన రామాలయాలు
- అన్నదానాలు



నిజామాబాద్‌రూరల్:

నవతెలంగాణ-కంఠేశ్వర్

సీతారాములు కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. నగరంలోని ఖిల్లా రామాలయం లో శ్రీ సీతారాముల కళ్యాణం వేడుక ఘనంగా నిర్వహించారు. శ్రీరాముని వివాహ మహోత్సవానికి ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య స్వామివారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది ఆలయ కమిటీ చైర్మన్ అధ్యక్షులుముక్కా దేవేందర్ గుప్త, సెక్రెటరీ గురుప్రసాద్ ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణంఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణోత్సవానికి కళ్యాణ సేవకులుగా ఎస్ ఎస్ ఆర్ విద్యాసంస్థలు చైర్మన్ హరిత మారయ్య గౌడ్ దంపతులు మంచాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మంచాల శ్రీలక్ష్మి జ్ఞానేందర్ గుప్త దంపతులు, ఎల్ వి ఆర్ షాపింగ్ మాల్ పద్మా రజిత శివప్రసాద్ , ధన్ పాల్ అంజలి ఉదయ్ కుమార్ స్వామి వారి కళ్యాణ వస్త్రంల దాత మంగళ సూత్రం సేవాదాత పాల్దే లక్ష్మీకాంతం కళ్యాణ మండపం అలంకరణ దాత అర్బన్ శాసనసభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ గుప్త శ్రీరామనవమి కళ్యాణోత్సవ కమిటీ పూజా విభాగం దాతలు కొండ వీర శేఖర్ ఆహ్వాన కమిటీ డి రాజేంద్రప్రసాద్ తాటి వీరేశం బెలాల్ పోతన్న కొండా దేవేందర్ సేవ చేశారు. అక్షయపాత్ర విభాగంలో తాటి వీరేశం గుప్తా చల్లా, గంగాధర్, గాదే సుదర్శన్ గుప్త సేవ చేశారు.

శ్రీరామ నవమి వేడుకల్లో అర్బన్ శాసనసభ్యులు దన్ పాల్ సూర్యనారాయణ గుప్త, జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విట్టల్ రావు పాల్గొన్నారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు , రాజేంద్రప్రసాద్, ఆలయ పూజారి సందీప్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో...

నగరంలోని న్యాల్కల్ రోడ్డు వద్ద గల అయోధ్య నగర్ కోదండ రామాలయంలో శ్రీరామ నవమి వేడుకలు ఆలయ కమిటీ అధ్యక్షులు మూఢ బాలయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు నగర మేయర్ దండు నీతూ కిరణ్ హాజరయ్యారు. నగరంలోని సుభాష్ నగర్ రామాలయం, ఆర్యగనఱలోని రామాలయంలో భక్తుల మధ్య కల్యాణ కమనీయంగా నిర్వహించారు. నగరంలోని జండా బాలాజీ ఆలయంలోనూ సీతారాముల కళ్యాణము ఘనంగా నిర్వహించారు



కంఠేశ్వర్: నగరంలోని రామాలయంలో..

పోతంగల్: మండల కేంద్రంలో శ్రీ రామ మందిరంలో శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ.. శ్రీ రాముడు మానవులందరికి ఆదర్శ పురుషుడు, మార్గదర్శకుడు అన్నారు. ఈ ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్ : మల్కాపూర్ గ్రామంలో శ్రీరామనవమి పండుగా సందర్భంగా సంత శ్రీ సేవాలాల్ మహారాజ్, శ్రీ జగదాంబ మాత మందిరంలో భోగ్ పూజా కార్యక్రమం ఆలయ కమిటీ చైర్మన్ మున్ని నాయక్ (మిషన్ భగీరథ డిఈ), నాయక్, కారోబార్లు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గంగారాం నాయక్, దదురావు, సమ్యానాయక్, బాణోత్ గోపాల్ నాయక్, హరిచంద్, తదితరులు పాల్గొన్నారు.

వర్ని : ఉమ్మడి మండలంలో ప్రతి గ్రామంలో ఊరు ఊరురా శ్రీరామ మందిరంలో భక్తులు మొక్కులు చెల్లించారు. శ్రీరాముల కళ్యాణం నిర్వహించి, మహిళలు కోలాటం ఆడారు. తదుపరి అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బోధన్ : శ్రీరామ నవమి పండగను పురస్కరించుకుని బుధవారం సాలూర మండల కేంద్రంలోని ఒంటి హనుమాన్ ఆలయంలో హనుమాన్ స్వాములు భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా హనుమాన్ స్వాములు ఆలయం నుంచి గ్రామ ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ బొర్ర గంగారాం, ఇల్తెపుశంకర్, స్వామిగౌడ్, సొసైటీ చైర్మెన్ అల్లె జనార్దన్ భక్తులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని నాగపూర్ లో శ్రీరామనవమి సందర్భంగా ఆలయ 63వ వార్షికోత్సవ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిపారు. స్వామివారికి బంగారం పుస్తె, మట్టెలు, ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. మండల కేంద్రంలోని శ్రీ గిరిక్షేత్రం వద్ద సీతారాముల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నవితరణ చేశారు. ఉదయం హనుమాన్ మాల ధారణ స్వాములు సీతారాముల ఉత్సవ విగ్రహాలతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ శోభ యాత్రలో పెద్ద సంఖ్యలో స్వాములతో పాటు యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వర్ని : చందూర్‌లో..



కమ్మర్‌పల్లిలో...

గల్ఫ్ కార్మికులు ఇప్పుడు గుర్తుకువచ్చారా..?

- ఏదో ఒక పదవి కోసమే జీవన్‌రెడ్డి పోటీ
- అరవింద్ టైంపాస్ చేసే వ్యక్తి
- బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ధ్వజం
- ప్రశ్నించేందుకు తనను అసెంబ్లీకి పంపాలని పిలుపు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సీఎం రేవంత్ రెడ్డికి ఇప్పుడు గల్ఫ్ కార్మికులు గుర్తుకు వచ్చారా..? ఎంతోమంది గల్ఫ్ వెళ్లిన వారిని బీఆర్ఎస్ పార్టీ తిరిగి వెనక్కు తీసుకువచ్చి ఉపాధి కల్పించింది. గల్ఫ్ లో ఎంతో మంది అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని ఇండియాకు బీఆర్ఎస్ తిరిగి తీసుకువచ్చింది. గల్ఫ్ కార్మికుల కోసం 100 కోట్ల బడ్జెట్‌ను సైతం కేటాయించాం. దానిని ఇప్పటివరకు ఉపయోగించలేదు. నేను ఎంపీగా ఎన్నికైన తర్వాత వాటిని గల్ఫ్ కార్మికుల కోసం ఉపయోగిస్తామని' బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను గ్యారెంటీ.. నేను గ్యారెంటీ అని రెవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని అసహ్యించుకునేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. రైతు బంధు సక్కగా ఇస్తా లేరు, ఎన్నికలు ఉంటేనే పథకాలు నడుస్తున్నాయని, పార్లమెంట్ ఎన్నికల తరువాత ఏ పథకం అమలు కాదు అని అన్నారు. రైతులకు ఏకకాలం 2 లక్షల రుణ మాఫీ చేయలేదని, 24 గంటల కరెంటు ఇస్తులేరు అని ఆరోపించారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

ధాన్యం కొనుగోలు చేసిన డబ్బులే ఇవ్వడం లేదు అని, బోనస్ డబ్బులు ఎక్కడి నుండి ఇస్తారు అని, రైతుల వద్ద నుండి కొనుగోలు చేయడానికి ఎటువంటి సౌకర్యాలు బర్దన్ లు లేవు, లారిలు లేవు అని అన్నారు.

రైతులకు రైతుబంధు లేదు, రైతు రుణమాఫీ లేదు అందుకే రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ ని నమ్మి పరిస్థితిలో లేరు అని కాంగ్రెస్ పార్టీలో ఉన్న సీనియర్ నాయకులు అబద్దాల రెవంత్ రెడ్డి నమ్మే పరిస్థితిలో లేరు అని అన్నారు. రైతులను ప్రజలను ఎన్నో రకాలుగా కేసీఆర్ ఆదుకున్నారని, మళ్ళీ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయద్దని, కెసిఆర్ కు కారు గుర్తుకే ఓటు వేయాలని ఆయన అన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో కారు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్ ని బలపరచాలని, కెసిఆర్ కు బలం పెంచిన వారు అవుతారు అని అన్నారు.

అరవింద్ ఒక్కసారి కూడా గ్రామాల్లోకి వెళ్లలే

బీజేపీ అభ్యర్థి అరవింద్ గ్రామాల్లోకి ఐదు సంవత్సరాలలో ఏ ఒక్క సారి గ్రామలలోకి వెళ్లలేదని ప్రజల సమస్యలను పరిష్కరించలేదని అన్నారు. ధర్మపురి అరవింద్ ఏం చేయడు టైం పాస్ వ్యక్తి అని అన్నారు. మధవనగర్ బ్రిడ్జి కి 90 కొట్లు కెసిఆర్ ఇచ్చాడు అని, మామిడి పల్లి బ్రిడ్జి కి చెసింది ఏమి లేదు అని అన్నారు. తాను ప్రజల మధ్య ఉన్న నాయకుడను అని, ప్రజల కోసం పనిచేస్తాను అని అన్నారు.

జివన్ రెడ్డి ఉద్యోగుల కోసం ఏ రోజు శాసన మండలిలో మాట్లాడలేదని, ఆయనకు ఏదో ఒక పదవి కావాలనే ఈసారి ఎంపీగా పోటీ చేస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే ప్రశ్నించే నాయకుడు కావాలని, ఈసారి తనకు ఎంపీగా అవకాశం కల్పించాలని కోరారు. అదేవిధంగా శుక్రవారం నామినేషన్ వేయడం జరుగుతుందని దానికి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. అదేరోజు మాజీ మంత్రివర్యులు హరీష్ రావు చేత పాత కలెక్టరేట్ గ్రౌండ్ లో బహిరంగ సభ ఉంటుందని అన్నారు.